క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ



పెనుగంచిప్రోలు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేయడంతోపాటు పెండింగ్ కేసులను పరిశీలించారు. పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్ఐ అర్జున్‌కు సూచించారు.

కిశోర బాలికలకు అవగాహన



వత్సవాయి: కిశోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూసుకోవడం ముఖ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి సూచించారు. భీమవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోరి వికాసంపై బాలికలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ యుక్త వయస్సు వచ్చిన బాలికలు ఎలా ఉండాలి, వారి ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ముఖ్యంగా కిశోర బాలికలు పాలు, గుడ్లు, ఆకుకూరలు వంటివి ఎక్కువగా తినడం అలవాటు చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల కారణంగా జరిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, బీబీజాన్, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో ఆలయం కిటకిట



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారిని శుక్రవారం భారీసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ భూమి స్వాధీనం

అనుముంచిపల్లి(జగ్గయ్యపేట): ఆక్రమణలో ఉన్న దేవాలయ భూమిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు జగ్గయ్యపేట చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ఈఓ జయప్రకాష్ తెలిపారు. గ్రామంలో ఉన్న ఆలయానికి చెందిన 2.88 ఎకరాలు మాగాణి భూమిని గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు ఈఓ వివరించారు.

పెరిగిపోతున్న ఇసుక కుప్పలు



జగ్గయ్యపేట: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక కుప్పలు రోజురోజుకు పేరుకుపోతుండటంతో సిబ్బందితోపాటు కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక అక్రమరవాణా చేస్తూ 11నెలలుగా పట్టుబడిన లారీలు, ట్రాక్టర్లలోని ఇసుకను రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ కార్యాలయంలో వద్ద డంప్ చేశారు. అయితే ఇలా నిల్వ చేసిన ఈ ఇసుక కుప్పలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రాకపోకలకు అవరోధంగా మారిన ఈ ఇసుక కుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి ఇసుకకు వేలం నిర్వహిస్తేనే ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉన్నందున ఆదిశగా చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తి సంకీర్తన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం కవులూరుకు చెందిన శ్రీసంతాన వేణుగోపాల భజన మండలి సభ్యులు భక్తి సంకీర్తనలను ఆలపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. బీహెచ్ సువర్ణ కుమారి పర్యవేక్షణలో పలువురు కళాకారులు అమ్మవారి కీర్తనలను ఆలపించగా భక్తులు పరవశించిపోయారు. అనంతరం కళాబృంద సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

మరమ్మతుల పేరిట.. మమ అనిపించారు!

పెనుగంచిప్రోలు: గతేడాది వరదల కారణంగా దెబ్బతిన్న ఆయా గ్రామాల రోడ్ల మరమ్మతు పనులను కూటమి పాలకులు నేటివరకు పూర్తిచేయకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర మొనతేలి ఉన్న ఆయా రోడ్లపై ప్రయాణం సాగించలేక వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు.

కంకర వేసి వదిలేశారు...

గతేడాది సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదలకు మండలంలోని పలు రోడ్లు నామరూపాలు లేకుండా పోయాయి. వరద ఉధృతికి తారు కొట్టుకుపోయి రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. అనిగండ్లపాడు నుంచి గుమ్మడిదుర్రు వెళ్లే రోడ్డు, ముచ్చింతాల-తాళ్లూరు, పెనుగంచిప్రోలు-ముచ్చింతాల తోపాటు పెనుగంచిప్రోలు-వేములనర్వ రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టిన కూటమి పాలకులు ఆయా పనులను పూర్తి చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కేవలం కంకర పోసి వదిలేశారు. కంకర వేసి నెలలు గడుస్తున్నా తారు వేయకపోవడంతో మొనతేలి ఉన్న కంకర కారణంగా ద్విచక్రవాహనాలు దెబ్బతింటున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఇక ఈ రోడ్లలో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



తారు వేయకపోవడంతో కంకర మొనతేలి ప్రమాదకరంగా ఉన్న పెనుగంచిప్రోలు-వేములనర్వ రోడ్డు

ప్రమాదాల బారిన వాహనచోదకులు..

లింగాల వద్ద కాజ్‌వే మరమ్మతులు జరుగుతుండటంతో ట్రాఫిక్‌ను పెనుగంచిప్రోలు మీదుగా మళ్లించడంతో వేములనర్వ-పెనుగంచిప్రోలు రోడ్డులో ట్రాఫిక్ భారీగా పెరిగింది. ఈ వాహనాల రద్దీ కారణంగా టైర్ల కింద పడి కంకర ఎవరిని గాయపరుస్తుందో అని ప్రజలు భయపడుతున్నారు. ఈ కంకరపై తారు వేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అవుతూ వాహనచోదకులు జారిపడిపోతున్నారు.



పూర్తికాని అనిగండ్లపాడు-గుమ్మడిదుర్రు రోడ్డు పనులు

పెనుగంచిప్రోలు-ముండ్లపాడు రోడ్డంతా గుంతలమయంగా ఉంది. విజయవాడ, నందిగామ వైపు నుంచి వచ్చే వాహనాలు అన్నీ కూడా ఈరోడ్డుపైనే రావాల్సి ఉంది. రోడ్డుకు పెద్దపెద్ద గుంతలు పడటంతో వాహనదారులు భయాందోళనలకు గురౌతున్నారు. ఇకనైనా కూటమి పాలకులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేస్తామంటూ ఇచ్చిన హామీ మేరకు పెనుగంచిప్రోలు మండలంలోని ఆయా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి...

అనిగండ్లపాడు నుంచి గుమ్మడిదుర్రు వరకు రోడ్డుకు కంకర వేసి వదిలేశారు. గ్రామం నుంచి కొద్ది దూరం మాత్రమే కంకరపై తారు వేసి, మిగిలినది అంతా అలాగే వదిలేశారు. కంకర పైకి తేలటంతో ద్విచక్రవాహనదారులు జారిపడిపోతున్నారు.



– నక్కా సుధాకర్, గుమ్మడిదుర్రు

కంకర మొనతేలి ప్రమాదకరంగా ఉంది

గతేడాది వరదలకు వేములనర్వ వద్ద రోడ్డు మొత్తం కొట్టుకుపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ పనులు పూర్తికాలేదు. రోడ్డుకు వేసిన కంకర మొత్తం పైకి తేలి ప్రమాకరంగా ఉంది. నీ రోడ్డులో ట్రాఫిక్ పెరగడంతో వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.



– గింజుపల్లి మధు, వేములనర్వ

నీటినిల్వలు లేకుండా చూసుకోవాలి

వీరులపాడు: దోమల నియంత్రణకు ప్రతిఒక్కరు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కోరారు. జాతీయ డెంగీ దినోత్సవం, డ్రైడే ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం ఆమె మండలంలోని పొన్నవరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అంతేకాకుండా ఇళ్లలోని తడి పొడి చెత్తను వేర్వేరుగా అందజేసి పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని గ్రామస్తులను కోరారు. తడి పొడి చెత్తతో తయారు చేసిన వర్మికంపోస్టు ఎరువు ప్యాకెట్‌లను రైతులకు అందజేశారు. అదేవిధంగా స్వామిత్వ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం డెంగీపై అవగాహన కల్పిస్తూ చేసిన ర్యాలీలో పాల్గొని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ సీతారామరాజు, కార్యదర్శి వీరభద్రరావు, వైద్యారోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి లావణ్య

కూటమి నేతల కనుసన్నల్లోనే ఇసుక అక్రమరవాణా

జగ్గయ్యపేటఅర్బన్: కూటమి నేతల అండదండలతోనే వత్సవాయి మండలం ఇందుగుపల్లిలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా సాగుతోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి కృష్ణారావు ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘిస్తూ పెద్దపెద్ద మిషన్లతో టిప్పర్లతో ఇసుకను అక్రమంగా తెలంగాణ రాష్ట్రానికి రవాణా చేస్తున్నారన్నారు. ఇసుకఅక్రమ రవాణాతో మునేటి నదిలో భూగర్భజలాలు అడుగంటాయన్నారు. దీంతో ఇందుగుపల్లి రక్షిత మంచినీటి పథకం ద్వారా ఏడెనిమిది గ్రామాలకు 40ఏళ్లుగా సాగుతున్న మంచినీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు మంచినీటికి అవస్థలుపడుతున్నారన్నారు. విజయవాడ ఎంపీ, జగ్గయ్యపేట ఎమ్మెల్యే అండదండలతోనే ఇసుక అక్రమరవాణా సాగుతోందనే చర్చ నియోజకవర్గంలో జోరుగా సాగుతోందన్నారు. ఇసుక అక్రమరవాణాపై పలుమార్లు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా లాభంలేకుండా పోయిందన్నారు. ఇసుక కోసం తవ్విన గుంతల్లో మునిగిపోయి గతంలో నలుగురు చనిపోయారని, ఈ విషయంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసువారు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలన్నారు. తద్వారా ఇందుగుపల్లి ప్రాంతంలోని పంట పొలాలు, మంచినీటి వనతిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్టీసెల్ నాయకుడు బద్దూనాయక్, న్యాయవాది శివరాత్రి పృధ్వీరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసిరెడ్డి కృష్ణారావు, పక్కన నాయకులు

డెంగీపై అవగాహన ర్యాలీ

నందిగామరూరల్: అకస్మాత్తుగా అధిక జ్వరం, తీవ్రమైన శరీరం నొప్పులు, శరీరంపై దద్దుర్లు, కళ్ల వెనుక నొప్పులు, వికారం, వాంతులు తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలలో సంప్రదించాలని వైద్యాధికారులు కామేశ్వరీ, గౌతమి, విజయకృష్ణ సూచించారు. మండలంలోని లింగాలపాడు, గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా డెంగీ లక్షణాలను వివరిస్తూ ఆయా గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ డెంగీ బారిన పడిన వారు వైద్యసేవలతో పాటు తగినంత నీరు, విశ్రాంతి తీసుకోవడం చాలా ముఖ్య మన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయని హెచ్చరించారు. దోమ కాటుతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశముందని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు బిక్షాలు, కృష్ణమూర్తి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లింగాలపాడులో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న సర్పంచ్ పద్మకుమారి

పెనుగంచిప్రోలు: పౌష్టికాహారంతో వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి సూచించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాలికలకు రక్తహీనతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి మాట్లాడుతూ సాధారణ రక్త పరీక్షల ద్వారా రక్తహీనతను ముందస్తుగా గుర్తించవచ్చన్నారు. ఐరన్ అధికంగా ఉండే మాంసం, గుడ్లు, ఆకుకూరలు, సిట్రస్ పండ్లు, మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవటం ద్వారా రక్తహీనత బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఎంఎస్‌కెలు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని ముండ్లపాడు, అనిగండ్లపాడు గ్రామాల్లో కూడా కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం..

నందిగామరూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీఓ కృష్ణకుమారి పేర్కొన్నారు. నందిగామ పట్టణం, మండల గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాలలో కిశోర వికాసంపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ బాలికలు తీసుకునే రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, పప్పుదినుసులు, గుడ్లు, క్యారెట్, పాలు, చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత తదితర లోపాలను నివారించడంతోపాటు ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించవచ్చని తెలిపారు. అనంతరం బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, బాలల చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కరుణకుమారి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు ఈ డైవర్షన్ పాలిటిక్స్ : తన్నీరు



పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులతో తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి రెడ్‌బుక్ పాలన పేరుతో వేధింపులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాలంటేనే ఆలోచించాలనే విధంగా భయాందోళనలు సృష్టించడమే ప్రభుత్వ పెద్దల ఉద్దేశంగా కనిపిస్తోందని విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం తన్నీరును ఆపార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తనుబుద్ది చంద్రశేఖరరెడ్డి, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు విశ్వనాథం రవి, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తన్నీరు వారిని దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతనంగా నియమితులైన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ బలోపేతానికి తమవంతు కృషిచేయాలని కోరారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేవరకు ప్రతికార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు.

అక్రమ కేసుల బనాయింపే లక్ష్యంగా...

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, నచ్చని వ్యక్తులపై అక్రమ కేసులు బనాయించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తోందని తన్నీరు విమర్శించారు. 11 నెలలుగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి చెందిన అనేక మంది నేతలను అక్రమ కేసుల పేరుతో వేధిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాగే వ్యవహరించి ఉంటే ఈరోజు టీడీపీ బ్రతికి ఉండేదా అని ప్రశ్నించారు. కూటమి పాలకుల తీరు భవిష్యత్‌లో తాము ఎలా వ్యవహరించాలో నేర్పిస్తున్నట్లుగా ఉందన్నారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అణగద్రొక్కాలని చూస్తే అంతకంటే అవివేకం ఉండదని హెచ్చరించారు. ఇకనైనా కూటమి పాలకులు డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగామ డివిజన్‌లో భారీ వర్షం

నందిగామరూరల్/కంచికచర్ల: నందిగామ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో వరి, మొక్కజొన్నలపై రైతులు పట్టాలు కప్పి వ్యవసాయోత్పత్తులను కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కావటంతో ఆయా గ్రామాల్లో కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కంచికచర్ల మండలంలో కురిసిన భారీ వర్షానికి పొలాల్లో ఉన్న మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతింది. ఆరబెట్టిన వరి ధాన్యం కూడా తడిచిపోయింది. కల్లాల్లో ఉన్న మిర్చి ముద్దయింది. అర్ధరాత్రి సమయంలో అకాల వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు.

176.8 మి.మీ వర్షపాతం నమోదు..

నందిగామ డివిజన్‌లో గురువారం రాత్రి 176.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, కంచికచర్ల మండలంలో అత్యధికంగా 89.6 మి.మీ వర్షపాతం నమోదైంది. నందిగామ మండలంలో 10.6మి.మీ, చందర్లపాడు మండలంలో 15.2 మి.మీ, వీరులపాడు మండలంలో 38.4మి.మీ, జగ్గయ్యపేట మండలంలో 9.8 మి.మీ, పెనుగంచిప్రోలు మండలంలో 5.6మి.మీ, వత్సవాయి మండలంలో 7.6మి.మీల వర్షపాతం నమోదైంది.



గండేపల్లిలో వర్షానికి తడిచిన మొక్కజొన్న పంటను ఆరబెడుతున్న రైతులు



వర్షం దెబ్బకు అంబారుపేటలో మొక్కజొన్నలపై పట్టాలు కప్పి ఉంచిన రైతులు

నేర నియంత్రణ చర్యలపై ప్రచారం

ఇబ్రహీంపట్నం: ప్రజల్లో నేర నియంత్రణ చర్యలపై అవగాహనకు చేరువ వాహనం ద్వారా పోలీసులు ఇబ్రహీంపట్నంలో వీడియో ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. చదువుకునే బాలికలు ఎలా ధైర్యంగా ఉండాలి, ఇళ్లల్లో మహిళలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సమాజంలో ఎలా మెలగాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. నివాస ప్రాంతాల మధ్య సంచరించే కొత్త వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వివరాలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు చేరువ వాహనం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఇబ్రహీంపట్నంలో చేరువ వాహనం ద్వారా ప్రదర్శిస్తున్న వీడియో తిలకిస్తున్న స్థానికులు

ముక్క చీరల వేలం వాయిదా



ముక్క చీరలను కాంట్రాక్టర్లకు చూపుతున్న ఆలయ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సమర్పించిన ముక్క చీరలు, అట్ట చీరలను దేవస్థానం శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించింది. ప్రస్తుతం దేవస్థానం గోడౌన్‌లో ఉన్న చీర ముక్కలతోపాటు రానున్న రెండేళ్ల కాలపరిమితిలో ముక్క చీరలను పోగు చేసుకునే హక్కును బహిరంగ వేలం నిర్వహించింది. ఆలయ ఏఈఓ దుర్గారావు పర్యవేక్షణలో లీజెస్ విభాగం సిబ్బంది ఈ వేలం నిర్వహించారు. బహిరంగ వేలంలో ముగ్గురు కాంట్రాక్టర్లు పాల్గొనగా, దేవస్థానం వద్ద ఉన్న ముక్క చీర ఒక్కొక్కటి రూ.10 చొప్పున ధర నిర్ణయించి వేలం ప్రారంభించారు. ఇక రవిక ముక్కలను బహిరంగ వేలం నిర్వహించగా, అధిక ధర అంటూ కాంట్రాక్టర్లు వేలం ప్రక్రియలో పాల్గొనలేదు. ఇక రానున్న రెండేళ్లలో ముక్క చీరలను పోగు చేసుకునేందుకు ఏడాదికి రూ.40 లక్షల చొప్పున ధర నిర్ణయించి వేలం ప్రారంభించగా కాంట్రాక్టర్లు ఎవ్వరూ ఆసక్తి చూపలేదు. దీంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

19న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జగ్గయ్యపేట: ఈనెల 19వ తేదీన జగ్గయ్యపేటలోని బి కన్వెన్షన్ హాల్‌లో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ శుక్రవారం బి కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించారు.

స్పీడ్ డయల్ యాప్‌తో తక్షణ భద్రత

కంచికచర్ల : మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద ప్లాజా సీఓఎం రాజారావు, ప్లాజా మేనేజర్ జయప్రకాష్ స్పీడ్ డయల్ భద్రత యాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ యాప్ రోడ్డు భద్రత కోసం ఎంతగానో దోహదపడుతుందని సీఓఎం రాజారావు అన్నారు. అంబులెన్స్ సేవలు, పెట్రోలింగ్ సేవలు, క్రేన్ సేవలకు ఎంతగానో ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు. రోడ్డుపై ఏదేని వాహనం ద్వారా ప్రమాదం జరిగిన సమయంలో యాప్ ఓపెన్ చేయగానే తక్షణమే సహాయం అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సెక్యూరిటీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ప్లాజా సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

18న ఛత్రపతి శివాజీ డిజిటల్ నాటకం ప్రదర్శన

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని స్థానిక సీతారామపురంలోని కొత్త వెంకటేశ్వరస్వామి కళ్యాణమండపంలో ఈనెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఛత్రపతి శివాజీ మహరాజ్ డిజిటల్ నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు శుక్రవారం తెలిపారు. శివాజీ జీవిత చరిత్ర నేటితరానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో సంస్కార భారతి అఖిలభారత సంస్థ ఆధ్వర్యంలో రూ.3లక్షలు వెచ్చించి అధునాతన టెక్నాలజీతో డిజిటల్ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. ఈ నాటకాన్ని అందరూ తిలకించాలని ఛత్రపతి శివాజీ మహరాజ్ కాంస్య విగ్రహ నిర్మాణ కోర్ కమిటీ ప్రతినిధులు పబ్బతి నరేంద్ర, సంకా భాస్కర్, నోముల రఘు, అల్లి రవిచంద్ర, తూములూరి అశోక్ కోరారు.

మృతురాలికి తన్నీరు నివాళి

జగ్గయ్యపేట అర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన రంగా రాజేశ్వరి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించినవారిలో ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి తదితరులు ఉన్నారు.